ప్రీ పీహెచ్‌డీ పరీక్ష కేంద్రం తనిఖీ

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న విసి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ప్రీ పీహెచ్‌డీ పరీక్షల కేంద్రాన్ని వైస్‌ఛాన్సలర్ జి.రంగ జనార్ధన శనివారం తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణ అధికారులకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరీక్షల విభాగం డైరెక్టర్ ఇ.కేశవ రెడ్డి, బి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల ప్రథమ గ్రాడ్యుయేషన్ డేలో మాట్లాడుతున్న పోలా భాస్కర్

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు

- ఎస్‌కెయు విసి రామకృష్ణారెడ్డి, కళాశాలల విద్యా కమిషనర్ పోలా భాస్కర్
- ఘనంగా ఆర్ట్స్ కళాశాల తొలి గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి అనంతపురం

విద్యార్థుల చేతిల్లో దేశ భవిష్యత్తు ఉందని ఎస్‌కెయు విసి రామకృష్ణారెడ్డి, కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్ అన్నారు. అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల తొలి గ్రాడ్యుయేషన్ డేను ప్రిన్సిపల్ డాక్టర్ ఎసిఆర్ దివాకర్ రెడ్డి అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాలల విద్యా కమిషనర్ పోలా భాస్కర్, ఎస్‌కెయు విసి రామకష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాల ఘనత ప్రపంచ దేశాలకు వ్యాపించిందన్నారు. ఈ కళాశాలలో చదువకుని ఎందరో ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. విద్యార్థులను గొప్ప వ్యక్తులను తీర్చిదిద్దిన ఘనత ఆర్ట్స్ కళాశాలకు దక్కుతుందన్నారు. సాధారణ స్థాయి విద్యార్థుల నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, రాష్ట్రపతి లాంటి మహోన్నత వ్యక్తులు ఇక్కడ విద్యాభ్యాసం చేశారన్నారు. ఆర్ట్స్ కళాశాలలో చదవడం అనేది ప్రతి విద్యార్థి గర్వంగా భావించాలన్నారు. వంద సంవత్సరాల ఘనత కలిగి, వేలాదిమంది విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలిపిన ఆర్ట్స్ కళాశాలలో మొట్ట మొదటిసారిగా గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించడం అభినందనీయం అన్నారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా 2019-22 బ్యాచ్‌కు చెందిన 400 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టా, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాలుగో జోన్ ఆర్జేడీ నాగలింగారెడ్డి, ఎస్‌కెయు రెక్టార్ మల్లికార్జున రెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ విద్యా సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డితో పాఅటు పలువురు అధికారులు, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'అధికారం'లో అసమ్మతి

- వైసిపిలో కుదరని సమన్వయం
- రాయలసీమ కో ఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి ఎదుటే నిరసనలు
- నచ్చజెప్పినా వారొద్దంటున్న నేతలు
- ఉమ్మడి జిల్లాలో బయటపడుతున్న విభేదాలు

అధికార వైసిపిలో అసమ్మతి సెగలు రాజుకుంటున్నాయి. నియోజకవర్గ సమన్వయ సమావేశాల్లో బాహాటంగానే అసంతృప్తిని నేతలు, క్యాకర్తలు వెల్లగక్కుతున్నాయి. వీటిని సమన్వయం చేసేందుకు ఏర్పాటు చేసిన సమావేశాల్లోనూ సమన్వయం కుదిర్చే యత్నాలు ఫలించడం లేదు. ఈ నేతలొద్దంటూ బాహాటంగానే రాయలసీమ సమన్వకర్త పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎదుటే తెగేసి చెబుతున్నారు. పలు నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులకు టికెట్లు వద్దంటే వద్దని నినాదాలు చేస్తున్నారు. గత పదిహేను రోజులుగా ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న వైసిపి నియోజకవర్గ సమన్వ సమావేశాల్లో ఆ పార్టీలో నెలకొన్న అసమ్మతిని బట్టబయలు చేస్తోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి నియోజకవర్గ సమన్వయ సమీక్షా సమావేశాల పేరుతో ఈ నెల ప్రారంభం నుంచి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ స్థాయిలో సమావేశాలను నిర్వహించలేదు. సార్వత్రిక ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసే పనిలో భాగంగా నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించే పనిని రాయలసీమ పార్టీ సమన్వయకర్తగానున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేపట్టారు. ఇందలో ఎక్కడైనా నాయకుల మధ్య సమన్వయ సమస్యలు వెలుగులోకి వస్తే వాటిని సరిచేసే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను చేపట్టారు. ఇప్పటికే అనంతపురం పార్లమెంటు నియోజకవర్గం పూర్తి సమీక్షలు పూర్తయ్యాయి. ప్రస్తుతం హిందూపురం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో సమావేశాలు జరుగుతున్నాయి. అనంతపురం పార్లమెంటు పరిధిలో ఉరవకొండ, తాడిపత్రి నియోజకవర్గాల్లో అధికంగానే అసంతృప్తిలు వెల్లడయ్యాయి. అయితే వాటిని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొంత వరకు సర్దిజెప్పే ప్రయత్నాలు చేసి సఫలీకృతమయ్యారు. హిందూపురం పార్టీమెంట్ పరిధిలో చూసినప్పుడు మడకశిర, పెనుకొండ, హిందూపురం నియోజకవర్గాల్లో అసమ్మతి సెగ తారా స్థాయికే చేరాయని చెప్పవచ్చు. మడకశిరలో సర్దిజెప్పేందుకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రయత్నించినా అసమ్మతి నాయకులు, కార్యకర్తలు వినలేదు. ఎమ్మెల్యే తిప్పేస్వామికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇటువంటి నాయకుడు తమకొద్దంటూ నిరసనలు తెలిపరు. తాజాగా శనివారం నాడు పెనుకొండ నియోజకవర్గ సమన్వయ సమావేశంలోనూ ఇదే తరహా నిరసన కన్పించింది. 'జగనన్న ముద్దు...శంకరనారాయణ వద్దు' అంటూ అసమ్మతి నేదలు పెద్దిరెడ్డి ఎదుట నినాదాలు చేశారు. మరోవైపు శంకరనారాయణ మద్దతుదారులు ఆయనకు అనుకూలంగా నినాదాలు చేయడంతో పెనుకొండలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమయంలో కొందరు అసమ్మతి నేతలు చెప్పులు చూపించడంతో ఇది మరింత ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. పోలీసులు మంత్రి పెద్దిరెడ్డిని మరో మార్గంలో సమావేశ ప్రాంతానికి పంపించారు. ఇలా వైసిపి నేతలు, కార్యకర్తల మధ్య విభేదాలు రచ్చకెక్కు తుండటంతో ఇద్దరి మధ్య సమన్వయ కుదర్చడం పెద్ద సవాల్‌గానే మారింది. ఒకవైపు శంకరనారాయణ సత్యసాయి జిల్లా అధ్యక్షులుగానూ ఉన్నారు. ఆయన నియోజకవర్గంలోనే సొంత పార్టీ నుంచే అసంతృప్తులు ఈ రకంగా వ్యక్తమవుతుంటే... ఇతర ప్రాంతాల్లోనున్న సమస్యలను ఏ రకంగా సమన్వయం చేయగలరన్నది ఇప్పుడు పార్టీ వర్గాల్లో సాగుతున్న చర్చ. కొన్ని చోట్ల బాహాటంగా అసంతృప్తులు బయటకు వస్తుండగా, మరికొన్ని చోట్ల తాత్కాలికంగా మౌనంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అధికార పార్టీలో అసంతృప్త జ్వాలలు రాబోయే ఎన్నికల నాటికి ఏ రకంగా మలుపులు తిరుగుతాయన్నది వేచి చూడాల్సి ఉంది.

పెనుకొండలో మంత్రి పెద్దిరెడ్డి ఎదుట నినాదాలు చేస్తున్న అసమ్మతి నేతలు

మడకశిరలో వైసిపి అసమ్మతి నేతల నిరసన

పెనుకొండ వైసిపిలో అసమ్మతి జ్వాల

ఎమ్మెల్యే శంకరనారాయణ వద్దంటూ మంత్రి పెద్దిరెడ్డి ఎదుట నినాదాలు

పెనుకొండ : శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలో అధికార వైసిపిలో అసమ్మతి జ్వాల బహిర్గతం అయ్యింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సాక్షిగా అసమ్మతి నేతలు పెనుకొండ ఎమ్మెల్యే, సత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షుడు శంకరనారాయణ తమకొద్దంటూ నినాదాలు చేశారు. 'ఈ ఎమ్మెల్యే మాకొద్దు.. మళ్లీ టికెట్టు ఇవ్వొద్దు' అంటూ నినాదాలు చేశారు. వైసిపి రాయలసీమ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గ సమీక్షా సమావేశాన్ని పెనుకొండ పట్టణంలోని మార్కెట్‌యార్డులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసిపి రాయలసీమ జిల్లాల కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. మంత్రి పెద్దిరెడ్డి సమీక్షా సమావేశంలో పాల్గొనేందుకు వస్తుండగా పెనుకొండ పట్టణ సమీపంలోని వై.జంక్షన్ వద్ద వైసిపి అసమ్మతి వర్గం నాయకులు సుధాకర్ రెడ్డి, గంపల రమణారెడ్డి, బ్రహ్మసముద్రం శ్రీనివాసులు, చాలకూరు అశ్వర్థమ్మ, నాగభూషణ్ రెడ్డి, అక్కులప్ప, బాలాజీ, నారాయణ రెడ్డి, నరేంద్ర రెడ్డి, నారాయణ రెడ్డి, సంజీవ రెడ్డి, దిలీప్ రెడ్డితోపాటు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే శంకర నారాయణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'ఎమ్మెల్యే డౌన్ డౌన్.. శంకరనారాయణ వద్దు, జగన్ ముద్దు' అంటూ నినాదాలు చేశారు. ఈ సమయంలో ఎమ్మెల్యే అనుచరులు అక్కడికి చేరుకుని 'శంకరనారాయణ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. దీంతో ఒక్కసారిగా రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఈ సమయంలో మంత్రి పెద్దిరెడ్డి కాన్వాయ్ ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా అసమ్మతి నేతలు అడ్డుకున్నారు. ముందుకు వెళ్లేందుకు వీల్లేకపోవడంతో మంత్రి స్వయంగా కారు దిగి అసమ్మతి నేతలతో మాట్లాడే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే శంకర్ నారాయణ మూడున్నర సంవత్సరాల్లో ఆయన సోదరులతో కలిసి చేసిన అవినీతిని, నాయకులపై పెట్టిన కేసుల వివరాలను గోరంట్ల సీనియర్ నాయకులు గంపల రమణారెడ్డి, బ్రహ్మసముద్రం శ్రీనివాసులు, సంజీవరెడ్డి, దిలీప్ రెడ్డిలు మంత్రికి వివరించారు. ఇలా మాట్లాడుతుండనే కొందరు కార్యకర్తలు మంత్రి మీదకు వచ్చే ప్రయత్నం చేయడంతో ఆయన వారిని పక్కకు తోసేశారు. అసహానానికి లోనైన కొందరు అసమ్మతి వర్గానికి చెందిన కార్యకర్తలు ఎమ్మెల్యేకు చెప్పులు చూపించారు. ఈ నిరసనల మధ్యనే మంత్రి వారిని దాటుకుని వెళ్లి మార్కెట్‌యార్డులో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. విబేధాలు వీడి వైసిపి గెలుపునకు కృషి చేయాలని ఆయన శ్రేణులకు పిలుపునిచ్చారు.

లైసెన్స్ టెస్ట్ డ్రైవ్ ప్రక్రియను పరిశీలిస్తున్న టిడిసి శివరామ్ ప్రసాద్

డ్రైవింగ్ లైసెన్స్ మంజూరులో సరికొత్త విధానం

డిటిసి శివరామ్ ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

డ్రైవింగ్ లైసెన్స్ మంజూరులో సరికొత్త విధానం అమలు చేస్తున్నట్లు జిల్లా రవాణా శాఖ కమిషనర్ శివరామ్‌ప్రసాద్ అన్నారు. శనివారం అనంతపురం ఆర్‌టిఒ కార్యాలయంలో నూతనంగా అమలుచేస్తున్న లైసెన్స్ టెస్ట్ డ్రైవ్ ప్రక్రియను పరిశీలించారు. వాహన దారులు టెస్ట్ డ్రైవ్ పూర్తిగా సాంకేతికత ద్వారా మంజూరుచేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నూతన విధానం తీసుకొచ్చిందన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. టెస్ట్ డ్రైవ్‌లో సిగ్నల్స్ పాటించడం, ఇండికేటర్స్ వేయడం, 8, హెచ్ క్రాస్‌లు ప్రకారం డ్రైవ్ చేయాల్సి ఉంటుందన్నారు. సెన్సార్‌ల ద్వారా అభ్యర్థి సరిగ్గా నడిపితే ఆటోమేటింగ్ సిస్టంలో పాస్ అవుతుందన్నారు. ఎక్కడ చిన్న పొరపాటు జరిగినా లైసెన్స్ మంజూరు కాదన్నారు. ఈ విధానం వల్ల ఎవరి ప్రమేయం అవసరం లేదన్నారు. రోడ్డుపై వాహనాలు నడపడం వచ్చిన వారు నేరుగా వచ్చి తమకు లైసెన్స్ పొందవచ్చని తెలిపారు. మధ్య వర్తులు, దళారులు, అధికారులతో సంబంధం లేకుండా లైసెన్స్ పొందవచ్చని తెలిపారు. రెండు రోజుల నుంచి ఈ విధానం ద్వారా లైసెన్స్‌లు జారీచేయడం జరుగుతోందన్నారు. పూర్థి స్థాయిలో అమలుచేసినప్పుడు ఎంత మంది ఒక రోజులో టెస్ట్ డ్రైవ్‌కి రావాలి. ఎన్ని లైసెన్స్‌లు మంజూరు చేయాలి వంటి నియమ నిబంధనలు తెలియజేస్తామని తెలిపారు.

ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్

జగన్ పాలనలో అభివృద్ధి శూన్యం : టిడిపి

గుత్తి : జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధి ఏ మాత్రం జరగలేదని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్ పేర్కొన్నారు. శనివీఆరం మండలంలోని బసినేపల్లి గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జితేంద్ర గౌడ్ మాట్లాడుతూ దేశంలో రాజధాని లేని రాష్ట్రం ఏపీ అని అన్నారు. రాజధాని లేకుండా పరిపాలన సాగించడం శోచనీయమన్నారు. గ్రామాల్లో సమస్యలు నెలకొన్నా వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గ్రామ సర్పంచుల నిధులను జగన్ పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు ప్రభుత్వం నిధుల కేటాయించలేదన్నారు. గతంలో తమ ప్రభుత్వం నిధులు కేటాయించి అన్ని వర్గాల అభివృద్ధికి తోడ్పాటును అందించిందన్నారు. రాష్ట్రంలో ప్రజలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు పరిపాలన కొనసాగాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి బీసీసెల్ అధికార ప్రతినిధి ఆర్.పవన్ గౌడ్, మండల కన్వీనర్ బర్దివలి, సర్పంచి భరత్‌కుమార్, ఎంపీటీసీలు ధనుంజయ, నారాయణస్వామి, మాజీ ఎంపీపీ వీరేష్, నాయకులు మోడే శ్రీనివాస్ యాదవ్, దిల్కా శీనా, మహమ్మద్ అలీ, అగ్గిరాముడు, టౌన్ బ్యాంకు అధ్యక్షుడు అబ్దుల్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడొచ్చు

జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడొచ్చని జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన పేర్కొన్నారు. శనివారం అనంతపురం జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల డిస్పెన్సరీ విభాగం నందు కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఉపకులపతి ఆచార్య జి.రంగజనార్ధన హాజరై కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. అలా చేయటం వల్ల ఆరోగ్యంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటామన్నారు. రక్తదానం చేయటం వల్ల ఆరోగ్యం చెడిపోదన్నారు. ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తినటం వల్ల శరీరంలో రక్తం బాగా అభివృద్ధి చెందుతుందని, బ్లడ్ డొనేషన్ మీద అవగాహన పెంచుకుని రక్తదానం చేయటం వల్ల పేద ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు రక్తం ఉచితంగా లభిస్తుందని తెలిపారు. రక్తం కృత్రిమంగా తయారు చేయలేమని అందుకోసం రక్తదానానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఈ రక్తదాన శిబిరంలో పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి.సుజాత, పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య ఇ.కేశవరెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ సత్యప్రసాద్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ జితేంద్ర గౌడ్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ ప్రసాద్, డిస్పెన్సరీ డాక్టర్ నారాయణప్ప, వర్శిటీ పిఆర్ఒ డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

అనంత జేఎన్టీయూ పూర్వ విద్యార్థుల బలంతో మరింత అభివృద్ధి సాధ్యమని ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన పేర్కొన్నారు. శనివారం అనంతపురం జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ సెమినార్ హాలు నందు 1972-77 సంవత్సరంలో ఇంజినీరింగ్ పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళన జరిగినది. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఉపకులపతి ఆచార్య జి.రంగజనార్ధన హాజరై, మాట్లాడుతూ ఇలాంటి పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొనడం తమ అదృష్టమని అన్నారు. కుటుంబంతో కలిసినటువంటి అనుభూతి ఉంటుందన్నారు. పలుప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలో ఉన్నత పదవుల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన మిత్రులు, స్వశక్తితో తమ సత్తా చాటిన మిత్రులు ఈ సందర్భంగా కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అల్యూమిని అసోసియేషన్ కళాశాలకు బలమని, యూనివర్సిటీ అభివృద్ధిలో అల్యూమిని సభ్యుల సలహాలు, సూచనలు తీసుకుంటామని తెలిపారు. పూర్వవిద్యార్థులు కళాశాలకు తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ యుపిఎస్‌సి మెంబర్ ఆచార్య వై.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కళాశాలలో అనేక మంది అధ్యాపకులు గొప్ప అనుభవజ్ఞులని కొనియాడారు. ఈ బ్యాచ్ విద్యార్థులతో తాను తన కెరీర్‌ను ప్రారంభించానని చెప్పారు. ఈ కళాశాల వల్లనే అనేక పదవులు అధిరోహించనని తెలిపారు. అనంతరం 1972-77 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆచార్య వై. వెంకటరామిరెడ్డిని, ఆచార్య సాయిబాబా రెడ్డి, ఉపకులపతి ఆచార్య జి.రంగజనార్ధన లను సన్మానించారు. ప్రిన్సిపల్ ఆచార్య పి. సుజాత అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్, 1972-77 బ్యాచ్ పూర్వ విద్యార్థులు డాక్టర్ ప్రసాద్‌రాజు, ప్రతాప్‌రెడ్డి, ఆచార్య సత్యప్రసాద్, నాగరాజస్వామి, పుల్లారెడ్డి, జయరామయ్య, రఘునాథ్, యూనివర్సిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న జెఎన్‌టియు విద్యార్థులు

సిమెంటు రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించండి

నగర మేయర్ మొహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అభివద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నగర మేయర్ మొహమ్మద్ వసీం సూచించారు. నగరంలోని 45, 47 డివిజన్ల పరిధిలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులను మేయర్ వసీం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ త్వరితగతిన నాణ్యతతో పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. నగరంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి సహకారంతో వేగవంతంగా చేపడుతున్నామన్నారు. నగరంలో ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రహదారులు, డ్రెయినేజీల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన సచివాలయాల పరిధిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విడుదల చేస్తున్న రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నాతమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీనివాసులు, అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు ఖాజా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

జాతీయ స్థాయి క్రికెట్‌కు 'శ్రీ చైతన్య' విద్యార్థి ఎంపిక

అనంతపురం కలెక్టరేట్ : స్థానిక కోర్టు రోడ్డులోని శ్రీ చైతన్య విద్యాసంస్థలో 8వ తరగతి చదువుతున్న గాండ్ల కౌశిక్ అంతర్జాతీయ క్రికెట్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి కౌశిక్‌ని శనివారం అభినందించారు. స్టూడెంట్ ఒలంపిక్ అసోసియేషన్ వారు నిర్వహించిన అండర్ 14 క్రికెట్ విభాగంలో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో మంచి ప్రతిభ కనబరచి అంతర్జాతీయ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. జనవరిలో శ్రీలంకలో జరిగే అంతర్జాతీయ క్రికెట్ టోర్నమెంట్‌లో కౌశిక్ పాల్గొంటాడు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ తబస్సుం, డీన్లు రుషిబాల, అప్పలనాయుడు, ఏవో గోపాల్, పిఇటిలు హసేన్, సురేష్ పాల్గొన్నారు

19న కలెక్టరేట్ ముట్టడి

పెద్దపప్పూరు : కలెక్టరేట్ ఎదుట ఈనెల 19వ తేదీన చేపట్టిన కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సిపిఐ రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం శ్రీ హరేరామ ఆశ్రమ సమీపంలో సమావేశం నిర్వహించారు. రైతుల సమస్యల పరిష్కారానికి 19వ తేది చేపట్టిన కలెక్టరేట్ ముట్టడిలో మండలంలోని రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టి.రంగయ్య,, మండల సహాయ కార్యదర్శి బోగతి రామేశ్వర్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీలకు తాడిపత్రి విద్యార్థుల ఎంపిక

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని యర్రగుంటపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. శనివారం అనంతపురం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి షూటింగ్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నాగేంద్ర, కవిత లను ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, పిఇటి పల్లవిప్రియ, ఉపాధ్యాయులు అభినందించారు.

బహుమతులు అందజేస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

'శ్రీ చైతన్య'లో మ్యాథ్స్ క్లబ్

అనంతపురం కలెక్టరేట్ : స్థానిక హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని శ్రీ చైతన్య బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం మ్యాథ్స్ క్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థీ ఒక శాస్త్రవేత్త కావాలని హితవు పలికారు. మ్యాథ్స్ ఎగ్జిబిషన్‌లో వందకు పైగా నమూనాలు తయారుచేసి వివరించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. బాలికల శాస్త్రీయ నృత్యాలు, గీతాలాపనతో పాఠశాల ఆవరణంలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు వేషాధారణలు, నాటికలతో అలరించారు. ఉత్తమ నమూనాలు ప్రదర్శించిన చిన్నారులకు ఎజిఎం సుబ్బారెడ్డి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సమీనా ఖాన్, అక్కడమిక్ జోనల్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, డీన్ సత్యనారాయణ, కో-డీన్ చంద్రమోహన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గడపగడపకూ మన ప్రభుత్వం

రాయదుర్గం రూరల్ : రాయదుర్గం పట్టణంలో 31, 32 వార్డుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విప్ కాపు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించిన బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి జగన్మోహన్ రెడ్డి పరిపాలన చేస్తున్నారని తెలిపారు. వైస్ ఛైర్మన్లు వలీబాషా, శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ మేకల శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈ రామ్మూర్తి పాల్గొన్నారు.

బుక్‌లెట్లు అందజేస్తున్న విప్ కాపు

వీడని వర్షాలు..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా అంటేనే గుర్తుకొచ్చేది కరువు. ఇక్కడి వారు వర్షాల కోసం ఎప్పుడూ ఆకాశం వైపు ఎదురు చూస్తూ ఉండేవారు. కాని గడిచిన రెండు సంవత్సరాలుగా వర్షాలు సాధారణం కంటే ఎక్కువగానే పడుతున్నాయి. దీంతో వర్షాలు లేక నష్టపోయే రైతులు ఈ కాలంలో అధిక వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది 2021-22 సంవత్సరంలో మొత్తం 58 రోజులు వర్షాలు పడ్డాయి. అందులో నైరుతి రుతుపవనాల సమయంలో 25 రోజులు వర్షాలు జిల్లాలో పడ్డాయి. ఈశాన్య రుతుపవనాలు సాధారణంగా చాలా తక్కువగా పడేవి. ఈ సమయంలోనూ 23 రోజులు అంటే అక్టోబరు నెల తరువాత కూడా నైరుతితో సమానంగా వర్షాలు పడ్డాయి. ఈ ఏడాది 2022-23 సంవత్సరంలో చూస్తే ఈశాన్యంలో అంటే జూన్ నుంచి సెప్టెంబరు ఆఖరు వరకు 33 రోజులు వర్షాలు పడ్డాయి. ఈశాన్యంలో అక్టోబరు నుంచి ఇప్పటి వరకు 18 రోజులు అంటే 51 రోజులు వర్షాలు పడ్డాయి. సాధారణంగా ఈశాన్య రుతుపవనాలు వచ్చే సమయానికి వర్షాలు చాలా వరకు తగ్గేవి. సాధారణ వర్షపాతం అక్టోబరు తరువాత నుంచి 136.2 మిల్లీమీటర్లు మాత్రమే కాని గతేడాది ఈ కాలంలో 258 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. ఈ ఏడాది 198 మిల్లీమీటర్లు నమోదయింది. మొత్తంగా చూస్తే గతేడాది 553 మిల్లీమీటర్లు ఇప్పటి వరకు వర్షపాతం నమోదయితే, ఈ ఏడాది 647 మిల్లీమీటర్లు నమోదయింది. దాదాపు 40 శాతం పైగానే అధికంగా వర్షాలు పడ్డాయి. మారిన ఈ పరిస్థితులు రైతులకు తీరని నష్టాన్ని మిగులుస్తున్నాయి. సాధారణంగా వర్షాధారం కింద వేరుశనగ పంటయే అధికంగా సాగవుతుంది. ఇటీవలి కాలంలో పత్తి, మిరప, కంది, ఆముదం పంటల సాగు పెరుగుతోంది. ఈ పంటలను ఎక్కువ భాగం జూన్, జులై నెలల్లో రైతులు సాగు చేస్తారు. ఈ పంటల నూర్పిడి అక్టోబరు ఆఖరు నుంచి నవంబరు నెలల్లో జరుగుతుంది. వర్షాలు ఈశాన్య రుతుపవనాల సమయంలో పెరగడంతో నూర్పిడి సమయంలో అధిక వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గడిచిన రెండేళ్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇకపోతే ఈ ఏడాది వరుసగా పడుతున్న వర్షాలతో చీడపీడలు పెరుగుతున్నాయి. వేరుశనగ దిగుబడి తగ్గింది. పత్తి, మిరప పంటలకు తెగుళ్లు అధికంగా రావడం ద్వారా నష్టపోయారు. ఇలా అధిక వర్షాలు రైతులను దెబ్బతిస్తున్నాయి. ప్రకృతిలో వస్తున్న మార్పులతో పంటల సాగు ఏ రకంగా చేపట్టాలన్న మీమాంసలోనూ రైతులు పడే పరిస్థితులు నెలకొన్నాయి. వరుసగా నష్టాలను చవిచూసిన రైతులు ఇప్పుడిప్పుడే ఇతర పంటల సాగువైపు మొగ్గు చూపుతున్నారు. ఈ సమయంలో ప్రకృతిలో వస్తున్న

మార్పులు ఆ పంటలను దెబ్బతీస్తున్నాయి. దీంతో పెట్టుబడులు పెద్దఎత్తున నష్టపోతున్నారు. గతంలో అతివృష్టి, ఇప్పుడు అధిక వర్షాలు రెండు రకాలుగానూ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడూలేని విధంగా డిసెంబరు లోనూ ఈ సంవత్సరం వర్షాలు పడ్డాయి. మాండౌస్ తుపాను కారణంగా ఈ నాలుగైదు రోజులు వరుసగా వర్షాలు పడ్డాయి. రైతులు నష్టపోయారు. వారిని ఆదుకోవాలని ఎపి రైతు సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు చేపడుతున్నారు. ప్రభుత్వం వైపు నుంచి ప్రకటన రాకపోతే పోరాటాలు నిర్వహిస్తామని చెబుతున్నారు. రైతులు కూడా ప్రభుత్వం వైపు సాయం కోసం ఎదురు చూస్తున్నారు. అధిక వర్షాలతో జరిగిన నష్టాలపై ప్రభుత్వం వైపు నుంచి అధికారిక ప్రకటనేదీ వెలువడలేదు.

'అనంతలక్ష్మి'లో ఫ్రెషర్స్ డే

కళాశాల ఛైర్మన్ అనంతరాముడును సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతలక్ష్మి కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబిఎ విద్యార్థులకు ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల ఛైర్మన్ అనంతరాముడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులందరినీ అనంతలక్ష్మి కుటుంబంలోకి మనసారా ఆహ్వానిస్తున్నామన్నారు. విద్యార్థులు కళాశాల నిబంధనలను పాటిస్తూ క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. జీవితంలో కమ్యూనికేషన్ అనేది చాలా ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. ప్రతి విద్యార్థీ మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా ముందుకెళ్లాలన్నారు. నైపుణ్యాలను పెంపొందించుకుని ఉత్తమ పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని కళాశాల నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్ర నాయుడు తెలిపారు. ఎబిఎ విభాగాధిపతి గురురాజ్ మాట్లాడుతూ విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు, ఆలోచనలతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా, వ్యాపార వేత్తలుగా ఇతరులకు ఉద్యోగాలిచ్చే వారిగా ఎదగాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మూర్తిరావు ఖోకలే, వైస్ ప్రిన్సిపల్ రామ సుబ్బారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ఉరవకొండ : జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు ఈనెల 23వ తేదీన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయం ప్రాధాన్యత, రైతు ఔన్నత్యం, సేంద్రీయ వ్యవసాయం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలతో పాటు ఇంటర్, పాలిటెక్నిక్, ఐటిఐ, డిగ్రీ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు, సెమినార్, వర్క్‌షాప్‌లు, ప్రదర్శనలు లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పోటీలలో విజేతలకు జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఇతర వివరాలకు 8074780746 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ట్రాఫిక్ అవేర్‌నెస్‌పై అవగాహన

అనంతపురం కలెక్టరేట్ : ట్రాఫిక్ అవేర్ నెస్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక రుద్రంపేట లోని ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ విద్యార్థులు శనివారం అవగాహన కల్పించారు .ఈ సందర్భంగా విద్యార్థులు యముడు, చిత్రగుప్తుడు తదితర వేషధారణలతో ర్యాలీ చేపట్టారు. రుద్రంపేట నుంచి రాంనగర్ ఫ్లైఓవర్ మీదుగా తెలుగుతల్లి కూడలి వరకు ర్యాలీ సాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి పెరిగిపోతున్న ట్రాఫిక్ కారణంగా జరిగే ప్రమాదాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ జోనల్ ఇన్‌ఛార్జి శివకుమార్, డీన్ సుబ్బయ్య, ఎజిఎం జగన్మోహనరెడ్డి, ప్రిన్సిపల్ గుణవతి, పాల్గొన్నారు.

జాతీయ పెన్షనర్ల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో అఖిల భారత పెన్షనర్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.పెద్దన్న గౌడ్ అధ్యక్షతన లలిత కళాపరిషత్ ఆడిటోరియంలో నిర్వహించిన వేడుకలకు జిల్లా ఖజానా శాఖ డిడి జె.సరళ విజయకుమారి, ప్రభుత్వ సరజానాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, రిటైర్డ్ ప్రిన్సిపల్ టి.రాజారాం, సర్వజన వైద్యశాల జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్‌రెడ్డి, లలిత కళాపరిషత్ కార్యదర్శి పద్మజ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. ఉద్యోగులుగా ఉన్నప్పుడు ప్రజలు సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందడం ప్రతి ఉద్యోగికి సాధారణం అన్నారు. శేష జీవితంలో ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాల్సి ఉంటుందన్నారు. పెన్షనర్స్‌కు పెన్షన్ ఎంతో ముఖ్యం అన్నారు. పెన్షనర్స్ సంక్షేమానికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. పెన్షనర్స్ దినోత్సవం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్న గౌడ్, శీలా జయరామప్ప మాట్లాడుతూ పెన్షనర్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన డిఆర్ బకాయిలు, పిఆర్‌సి అరియర్స్ చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన డిఆర్‌ల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా డిఆర్ ప్రకటించాలన్నారు. 1వ తేదీనే పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ మేరకు తీర్మానం ప్రవేశపెట్టగా అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్లు 150 మందికి గౌరవ సూచికంగా సముచితంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

పెన్షనర్స్ సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎన్నికల అధికారి నారాయణస్వామి తెలిపారు. పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షులుగా బి.పెద్దన్నగౌడ్, ప్రధాన కార్యదర్శిగా శీలా జయరామప్ప, కోశాధికారిగా జి.రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.ప్రభాకర్, సహాధ్యక్షులు ఖలందర్, ఉపాధ్యక్షుడు మహ్మద్, తిప్పన్న, రఘురాం, రమేష్, డేనియల్ ప్రభాకర్, ఫరియానా, సంయుక్త కార్యదర్శులు బి.క్రిష్టప్ప, హెచ్.జయరాం, బి.పుల్లన్న, వరదరాజులు, యు.చంద్రశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అఖిల భారత పెన్షనర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం సోమనాథ్ నగర్‌లోని బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ భవన్‌లో జిల్లా కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 75 ఏళ్లు నిండిన పెన్షనర్స్‌ను సన్మానించారు. సమాజ సేవ చేస్తున్న రవికాంత్ క్యాటర్స్ కెవి.రమణ, సాయి ట్రస్ట్ విజయసాయిలను సన్మానించారు. బిఎస్ఎన్ఎల్ ఆలిండియా పెన్షనర్స్ సంఘం అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా ఎన్నికైన రాజశేఖర్‌రెడ్డిని సన్మానించారు.

పెన్షనర్‌ను సన్మానిస్తున్న డిప్యూటీ మేయర్ భాస్కర్‌రెడ్డి

అనంతపురంలో పెన్షనర్లను సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి : పట్టణంలోని ఫుట్‌బాల్ మైదానం వద్ద ఉన్న ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం కార్యాలయంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుత్తి ఉప ఖజానాధికారి సురేష్‌బాబు హాజరయ్యారు. ఉద్యోగులకు పెన్షన్ రావడానికి కారణమైన డిఎస్ నకార చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను నాయకులు కొనియాడారు. అనంతరం 70 సంవత్సరాలు దాటిన ఆరుగురు పెన్షన్‌దారులను నాయకులు సత్కరించారు. అలాగే ఎస్‌టిఒ సురేష్‌బాబుకు సన్మానం చేశారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కె.అబూబకర్, కార్యదర్శి రామ్మోహన్, ఉపాధ్యక్షులు స్వర్ణాంబ, అదనపు కార్యదర్శి జన్నే కుల్లాయిబాబు, కోశాధికారి ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని పెన్షనర్ల భవనం వద్ద అంతర్జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ రామాంజనేయులు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను ఐక్యతతో సాధించాలన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి నాగరాజ్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇస్తే భారాలతో నడ్డివిరుస్తున్నారు..

ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ప్రజలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అధికారం కోసం ఒక్క అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఓట్లు వేయించుకుని ప్రజలపై భారాలు మోపుతూ నడ్డి విరుస్తున్నాడని పలు కాలనీవాసులు టిడిపి బృంద సభ్యులతో అన్నారు. శనివారం టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి నేతృత్వంలో అనంతపురం రూరల్ మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో ఇదేం ఖర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు పలు సమస్యలను టిడిపి నేతల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామం తాగునీటితో ఇబ్బంది పడుతున్న తరుణంలో టిడిపి పాలనలో తడకలేరు నుంచి పైపులైను వేయించి మాకు నీళ్లు ఇచ్చారని గుర్తుచేశారు. అంగన్‌వాడీ స్కూల్‌కు సిమెంట్ రోడ్లు వేయించారని, దేవాలయానికి నిధులు ఇచ్చారని తెలిపారు. టిడిపితోనే అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకం ఉందన్నారు. రాబోయే రోజుల్లో టిడిపి నాయకులను గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ సాకే గంపన్న, రాష్ట్ర కార్యదర్శులు దేవర్ల మురళి, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, నారాయణ స్వామి యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు డిష్ నాగరాజు, జిల్లా టిఎన్‌టియుసి అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, నగర మహిళా అధ్యక్షురాలు విజయశ్రీ రెడ్డి, మాజీ కార్పొరేటర్ శివబాల, శ్రీనివాస్ చౌదరి, గుర్రం నాగభూషణ, ముక్తియార్, మారెప్ప, రాయల్ రఘు, శిరిశాల రాంబాబు, గోపాల్ గౌడ్, సరిపూటి శ్రీకాంత్, ఓబులపతి తదితరులు పాల్గొన్నారు.

ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

నేరాలు ఘోరాలు

తల్లీకొడుకులపై కొడవలితో దాడి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

దారికి గొర్రెలు అడ్డంగా ఉన్నాయని గొడవపడి తల్లీ కొడుకులపై కొడవలితో దాడిచేసి గాయపరచిన సంఘటన బుక్కరాయసముద్రం మండలం నీలంపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బుక్కరాయసముద్రం మండలం నీలంపల్లి గ్రామానికి చెందిన పూజారి ఆదినారాయణ, నాగరాజుకు సంబంధించిన గొర్రెలు రోడ్డుకి అడ్డంగా పడుకున్నాయి. అటుగా వెళుతున్న కురుబ నాగేంద్ర ఈ విషయంపై వారితో గొడవపడ్డాడు. మాటామాట పెరగడంతో కురుబ నాగేంద్ర తన చేతిలోని కొడవలితో కురుబ నాగరాజు, ఆయన తల్లి లక్ష్మిదేవిపై దాడిచేశాడు. ఈ దాడిలో తల్లీ కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. వారిని కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కురుబ నాగరాజు పరిస్థితి విషమంగా ఉంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామంలో గొడవలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

గాయపడ్డ లక్ష్మిదేవి

ఆలయాన్ని పరిశీలించిన డీఎస్పీ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండల పరిధిలోని చదం గొల్లలదొడ్డి గ్రామ సమీపంలోని పశుపతి నాథుని ఆలయాన్ని కళ్యాణదుర్గం డివిజన్ డిఎస్‌పి శ్రీనివాసులు శనివారం సందర్శించి ఆలయ పరిసరాలను పర్యవేక్షించారు. శుక్రవారం రాత్రి ఆలయం ప్రధాన ద్వారం తలుపులు పగులగొట్టి దొంగతనం చేసేందుకు ప్రయత్నిస్తుండగా తమ రాకను గమనించి దుండగులు పరారయ్యారని అయ్యప్పస్వామి మాలదారులు సమాచారాన్ని సోషల్ మీడియాలో వ్యాప్తి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు రాత్రి సంఘటనా స్థలానికి చేరుకొని గాలించారన్నారు. శనివారం డిఎస్‌పి ఆధ్వర్యంలో ఆలయ పరిసర ప్రాంతాల్లో పర్యవేక్షించారు. ఈ విషయంపై వివరాలు తెలుసుకునేందుకు పోలీసులను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

కళాశాలకు ఎమ్మెల్యే విరాళం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల అవసరాల దృష్ట్యా కళాశాల అభివృద్ధికి ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి రూ.1.70 లక్షలు విరాళంగా ఇచ్చారు. శనివారం కళాశాల అధ్యాపకులకు చెక్కును అందజేశారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-గుంతకల్లు

ఐసిడిఎస్ పరిధిలోని గుత్తి, గుంతకల్లు, పామిడి, పెద్దవడుగురు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ వర్కర్లు, సహాయకుల (ఆయా) పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.నాగమణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 1.7.2022 నాటికి 25 నుండి 35 ఏళ్లలోపు వయస్సు కలిగివుండాలన్నారు. అభ్యర్థులు స్థానికులై పదవ తరగతి ఉత్తీర్ణత సాధించి, వివాహితులు అయిఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 19 నుండి 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు గుత్తి ఐసిడిఎస్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు గుత్తి కార్యాలయంలోని నోటీసు బోర్డులో చూడాలన్నారు.

ఉరవకొండ : ఉరవకొండ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న 8 అంగన్వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ శ్రీదేవి తెలిపారు. వజ్రకరూర్ మండల పరిధిలోని గూలపాళ్యం 1 (ఎస్సీ) గూలపాల్యం 2 (బిసి-ఈ), చాయాపురం ఒహెచ్‌జె.రాంపురం (ఎస్సీ), ఉరవకొండ మండల పరిధిలోని ఇంద్రావతి గ్రామంలో 1 (ఒసి), ఉరవకొండ 25వ సెంటర్‌లో 1 (బిసి-బి), షెక్షానుపల్లిలో 1 (ఒసి), విడపనకల్ మండల పరిధిలోని హావలిగి మూడవ సెంటర్లో 1 బీసీ-బి కేటగిరీల వారీగా అంగన్వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హులు సంబంధిత సర్టిఫికెట్లను జతపరిచి ఉరవకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఈ నెల19వ తేదీ నుండి 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బొమ్మనహాల్ : మండల పరిధిలోని కనేకల్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్లు, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ ఎల్లమ్మ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని కృష్ణాపురం, ఓసల్లి, సిద్ధరాంపురంలో జనరల్ కేటగిరి, దేవగిరి, బొమ్మనహల్, సిగేపల్లి గ్రామాల్లో బీసీ కేటగిరి, గుంతకల్ చంద్రగిరి గ్రామాల్లో ఎస్టీ కేటగిరి ఉప్పరాల సింగేపల్లి బీసీ కేటగిరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులు జనవరి 7వ తేదిలోపు ఐసిడిఎస్ కనేకల్ ప్రాజెక్టు నందు దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. ఇతర వివరాలకు ఐసిడిఎస్ కనేకల్ ప్రాజెక్టు అధికారులను సంప్రదించాలని కోరారు.

టిడిపి నాయకులపై దాడులు అమానవీయం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మాచర్ల నియోజకవర్గంలో టిడిపి నాయకులపై వైసిపి కార్యకర్తల దాడి అమానుషమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వర్ నాయుడు అన్నారు. వైసిపి దాడులకు నిరసనగా స్థానిక ఎన్టీఆర్ భవన్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. సిఐ తేజోమూర్తి ఉమామహేశ్వర నాయుడిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఆయనను విడిచిపెట్టాలని టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అనంతరం సొంత పూచీకత్తుపై ఉమామహేశ్వర్ నాయుడు ని విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ దొడగట్ట నారాయణ, డిష్ మురళి, తలారి సత్యప్ప, విరూపాక్షి, శీను, వలీ, రాజు. కామక్కపల్లి నాగరాజు, తెలుగు నాడు విద్యార్థి సంఘం నాయకులు మనోజ్, శ్రీధర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : గుంటూరు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో టిడిపి నాయకులపై వైసీపీ నేతల దాడిని అనంతపురం టిడిపి అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి శనివారం ఖండించారు. 2024 ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసిపి టిడిపి నాయకులపై దాడులు చేస్తున్నారన్నారు. ప్రజలు దీనిని గమనిస్తున్నారని ఓటుతోనే వైసిపికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

పుట్లూరు : మాచర్ల నియోజవర్గంలో టిడిపి నాయకులపై వైసిపి నాయకులు, కార్యకర్తలు దాడిచేయడం అమానుషమని టిడిపి జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి సుదర్శన నాయుడు అన్నారు. ప్రతిపక్షాలను అంతమొందించడమే వైసిపి పన్నాగం అన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్ నాయుడు, రవిచంద్ర నాయుడు, మైనార్టీ నాయకులు దస్తగిరి, బిసిసెల్ నాయకులు తీర్థమయ్య, రామాంజనేయులు, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంలో రాస్తారోకో చేస్తున్న టిడిపి నాయకులు